పెట్టుబడి సాయం అందేనా?

- కౌలు రైతులకు ప్రభుత్వం మొండి చేయి
- అప్పుల ఊబిలో రైతన్నలు



దెందులూరు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి పంటలపై పెట్టుబడి పెట్టి ప్రభుత్వ పరంగా గుర్తింపు లేక అవమానాలకు గురవుతున్నామని వాపోతున్నారు. మరో వైపు ప్రకృతి సహకరించటం లేదని నెలకు నాలుగైదు సార్లు తుఫాన్లు, వర్షాలు వస్తే తాము పండించిన పంటకు గిట్టుబాటు ఎక్కడ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. మారుతున్న వాతావరణ కాలానికి అనుగుణంగా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ధాన్యానికి క్వింటాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించాలని కోరుతున్నారు.

కౌలు రైతుల రక్షణకు చట్టం చేయాలి

ఈ–క్రాప్‌లో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలి. ఇలా చేస్తేనే కౌలు రైతులు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భద్రత భవిష్యత్ జీవన విధానం మెరుగుపడుతుందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. కౌలు రైతుల రక్షణకు నూతన చట్టం తీసుకురావాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. కౌలు రైతులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు శాశ్వతంగా మేలు జరిగేలా ప్రణాళిక రూపొందించాలి. చట్టబద్ధత కల్పించాలని ఈ ప్రాంత కౌలు రైతుల వాదన.

దెందులూరు నియోజకవర్గం వివరాలు

కౌలు రైతులు : 25 వేల మంది

సాగు చేసే విస్తీర్ణం: లక్ష 18 వేల ఎకరాలు

ప్రభుత్వం స్పందించాలి



కౌలు రైతులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి. అన్ని వర్గాల ప్రతినిధులతో చర్చించి ఆమోదయోగ్యంగా ప్రణాళిక రూపొందించాలి. క్షేత్ర స్థాయిలో పగలనక రాత్రనక శ్రమించి లక్ష రూపాయలు పంటలపై పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వ ప్రకృతి రెండు వైపులా ఇటీవల కౌలు రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదు.

– కె.శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి

రైతులను నిర్లక్ష్యం చేస్తారా?



రైతులను నిర్లక్ష్యం చేయడం తగదు. పెట్టుబడి సాయం అందించరు. యూరియా సైతం రైతులకు అందించకపోవడంతో గగ్గోలు చేస్తే గాని సరఫరా చేయడంలేదు. కౌలు రైతులను సైతం ప్రభుత్వం వివక్షతకు గురి చేస్తుంది. రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతు ప్రభుత్వం ఎలా అవుతుంది.

– కొలుసు గణపతిరావు, రైతు

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి



ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

గణపవరం: విద్యార్థుల్లో జాతీయ భావం, సేవాభావం పెంపొందించడానికి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్ పథకంలో చేరితే, ఉత్తమ పౌరులుగా, సమాజ సేవకులుగా, దేశభక్తి, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తయారవుతారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ విపత్తులు, కరోనా వంటి వైపరీత్యాల సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ మనకు సేవాభావం, సామాజికబాధ్యత, దేశభక్తి వంటి విలువలు నేర్పుతుందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కేవీ గణేష్ కుమార్, ఎంబీ శ్రీనివాసరావు, సీహెచ్ చైతన్య, సీహెచ్ అనూరాధ, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



రజకులతో మాట్లాడుతున్న కట్లయ్య

ఉంగుటూరు: రజకుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఏలూరు జిల్లా నియోజకవర్గంలో కొన్ని గ్రామాలు సందర్శించి రజకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రావులపర్రు గ్రామంలో రజకుల నేలయ కుంట చెరువును పరిశీలించారు. గ్రామంలో సుమారు 30 రజక కుటుంబాలు తరతరాలుగా వృత్తి చేస్తున్న చెరువులకు ఇంత వరకు కనీస ధర పంచాయతీ అధికారులు డివిజనల్ పంచాయతీ అధికారికి పంపించకపోవడం తగదన్నారు. రజక వృత్తిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారులు గమనించి రజకులకు సహాయం చేయాలని కట్లయ్యతో సహా రజక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నేతలు కొమ్మంటి మురళి, సాంబశివరావు, శ్రీనివాసు, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ క్యాంపులో సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

భీమడోలు: ఆధార్ అనుసంధానంతోనే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. మండల వ్యాప్తంగా భీమడోలు, పోలసానిపల్లి, దుద్దేపూడి సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ క్యాంపులను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. భీమడోలులో డిజిటల్ అసిస్టెంట్లను ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, పలు పథకాల లబ్ధిదారులు తమ ఆధార్‌ను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలన్నారు. ఈ క్యాంపులు ఈ నెల 26వ తేదీ శుక్రవారం వరకు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భీమడోలు గ్రామకార్యదర్శి కేవీఎల్ తనూజ, సిబ్బంది, పెద్దలు పైడిమాల యుగంధర్, ఈతకోట సత్యకృష్ణ, సిబ్బంది బెల్లం కొండ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక బలోపేతమే పీ–4 లక్ష్యం

పేద కుటుంబాల ఆర్థిక బలోపేతానికి పీ–4 బంగారు కుటుంబాలు కార్యక్రమం దోహదపడుతుందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం పీ–4 బంగారు కుటుంబాలు అనే కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు యాప్‌లో నమోదుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సుబ్బారావు, ఏవో బీవీఎస్‌వీ శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు వరం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్



దెందులూరు: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీతంపేట బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాస్



గణపవరం: కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి



ఉంగుటూరు: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దెందులూరు: నాణ్యమైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను గ్రామీణ ప్రాంతాల్లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ అందిస్తుందని పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ సీతంపేట సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం పెరుగ్గూడెం గ్రామంలో వైద్యశాఖ అధికారులతో కలిసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఎన్సీడీ స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణుల సంరక్షణ, తల్లి రక్షణ (ఎంసీపీ) కార్డ్ టీకాలు తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోతునూరు వైద్యాధికారిణి చైతన్య, సిబ్బంది ప్రభాకర్ రావు, హరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు వైద్యశిబిరం

గణపవరం: మండలంలోని అర్ధవరంలో బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్యభవన్‌లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి పి.కిరణ్మయి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాలు మహిళలకు ఆరోగ్య భద్రత కల్పిస్తాయన్నారు. 30 సంవత్సరాలు నిండిన మహిళలు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ గాతల సుజాత మహిళలు తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకుని, తగిన వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, అద్దేపల్లి శ్రీనివాసరాజు, కంతేటి కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఉంగుటూరు: నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు బాలికలకు, గర్భిణులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద, ఎంపీడీవో జీఆర్ మనోజ్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, సర్పంచి అలకనంద, మాలతీరాణి, దుర్గారావు, రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన పెంచుకోవాలి



వృత్తి విద్యా కోర్సుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి: వృత్తి విద్యా కోర్సుల్లో సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను నేర్చుకున్నారని కొప్పాక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.శైలజ అన్నారు. బుధవారం పెదవేగి మండలం, కొప్పాక గ్రామం సర్వ శిక్షా అభియాన్ పథకం కింద, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు స్థానిక సచివాలయాన్ని 12 రోజుల పాటు సందర్శించారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాలన, డిజిటల్ సేవలను అవగాహన చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడిందని, హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమాన్ని వృత్తి శిక్షకుడు శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని శివారెడ్డి, శ్రీను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.

నూజివీడు సీడ్స్ అధినేత మృతి బాధాకరం

దెందులూరు: నూజివీడు సీడ్స్ అధినేత మండల వెంకటరామయ్య ఆకస్మిక మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నూజివీడు సీడ్స్ సంస్థను ప్రారంభించి లక్షలాది మంది రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తూ భారతదేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ సీడ్ కంపెనీగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకొని కీర్తిని పొందారన్నారు. ఎంతో మందికి జీవనోపాధి కల్పించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి అబ్బయ్యచౌదరి తెలిపారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ, ఏవో

గణపవరం: రానున్న రోజుల్లో రైతులు యూరియా వాడకాన్ని బాగా తగ్గించాలని, దాని స్థానంలో నానో యూరియా, నానో డీఏపీ వాడకాన్ని పెంచాలని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ ఏడీఏ గంగాధర్ రైతులకు సూచించారు. బుధవారం గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే దాళ్వాకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ముందస్తు చర్యలతో పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏవో ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతుసేవా కేంద్రాల్లో నిల్వ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మద్దాల మహంకాళి, కవల రాంబాబు, సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సిరి సంపదల అన్నపూర్ణగా దుర్గాదేవి

- ఆలయాల్లో అమ్మవార్లకు మహిళల పూజలు
- మూడో రోజుకు చేరిన దసరా ఉత్సవాలు



నిడమర్రు: అన్నపూర్ణ అలంకరణలో అమ్మవారు



ఉంగుటూరు: పూజలందుకుంటున్న చల్లాలమ్మ



భీమడోలు: శైలి పుత్రి అవతారంలో భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి



గణపవరం: శక్తివేషధారణలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



దెందులూరు: ఆయుధ పూజ చేస్తున్న కళాశాల యాజమాన్యం

భీమడోలు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు బుధవారం వైభవోపేతంగా సాగాయి. అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు భవానీ మాతకు విశేష పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శైలి పుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్ శర్మ, లంకా శ్రీనివాస్ శర్మ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నర్సింగ్ కళాశాలలో ఆయుధ పూజ

దెందులూరు: దసరా మహోత్సవంలో భాగంగా బుధవారం బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ నూకరాజు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రత్యేకంగా దసరా పండుగను అభివర్ణించారు. సైన్స్ ప్రకారం ఈ కాలంలో పనిముట్లు ఎక్కువ పాడవటానికి అవకాశం ఉంటుందని వాటిని శుభ్రపరచటం తప్పనిసరని ఈ పూజలు అన్ని వర్గాల వారు నిర్వహిస్తారన్నారు. నర్సింగ్ సీనియర్, జూనియర్ విద్యార్థులు దసరా మహోత్సవాలను పుస్తకం, పెన్నును, రంగవల్లితో 52 మంది నర్సింగ్ విద్యార్థులు 9 గంటలు శ్రమించి అలంకరించారు.

అన్నపూర్ణ దేవిగా అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగు అచ్చారావు, తోట అచ్చారావు, ఏనుగు వెంకన్న, కుంకుల్ల చందు, బొర్రా చందు, ఏనుగు పండు, అప్పక చంటి, మోదుగుమూడి నాయుడు, కూనిశెట్టి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కరుణించమ్మా అన్నపూర్ణమ్మ

నిడమర్రు: కరుణించమ్మా అన్నపూర్ణమ్మ అంటూ మండలంలోని దుర్గామాత మండపాలు, ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. మండలపర్రు పంచాయతన క్షేత్రం, పెదనిండ్రకొలను, బువ్వనపల్లి, పత్తేపురం, చానమిల్లి, క్రొవ్విడి, భావాయిపాలెం గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవులు అన్నపూర్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నవరాత్రి ప్రత్యేక పూజలు

ఉంగుటూరు: ఉంగుటూరులో గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు చంద్రగంటి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయం వద్ద రెడ్డి చందు ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. భీమేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న ట్రస్టీ బోర్డు చైర్మన్ నారాయణం హనుమంతరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

వైభవంగా దుర్గాదేవికి పూజలు

గణపవరం: దసరా ఉత్సవాలు వాడవాడలా వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గాయత్రీదేవిగా, బాలాత్రిపుర సుందరిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చినరామచంద్రపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహిళలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. గణపవరం బస్టాండ్ వద్ద రామాలయం వీధిలో కనకదుర్గమ్మ 18వ వార్షిక మహోత్సవాల సందర్భంగా చిన్నారులు చేసిన శక్తి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతను బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. సువర్ణగుండం చెరువు వద్ద తోటలో కనకదుర్గాలయం, గణపవరం బాలయ్య చెరువు వద్ద కంచి కామాక్షి కనకదుర్గ ఆలయం, సరిపల్లె కనకదుర్గ ఆలయం పిప్పరలోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులతో అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి.

దేవస్థానం భూమి కౌలు వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఎకరం భూమికి బుధవారం దేవస్థానం అధికారుల సమక్షంలో వేలం నిర్వహించారు. కొన్నేళ్లుగా ఈ భూమి అన్యాక్రాంతం కాగా ఇటీవల దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమికి రైతులు పోటీ పడ్డారు. వేలంలో రైతు బి.రంగారావు రెండు సీజన్లకుగాను ఏడాదికి రూ.54 వేలకు లీజుకు దక్కించుకున్నారు. దీంతో దేవస్థానానికి ఈ భూమి నుంచి కౌలు సొమ్ము సమకూరడంతో రైతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్ బాబు నాయుడు, ఆలయ చైర్‌పర్సన్ వగ్వాల మీనాకుమారి, పెద్దలు అచ్యుత రామారావు, రైతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదవేగి: పెదవేగి నుంచి రామసింగవరం వెళ్లే లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. రైతు సోదరులకు రెండు విడతలుగా తెల్లవారుజామున 3 నుంచి 7 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా చేయబడునని ఆయన తెలిపారు.

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

దెందులూరు: దాత, దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రం చైర్మన్ కలపాల శ్రీహరి ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రూ.3 లక్షలతో దాత ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో భీమరాజు, నాయకులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దీక్షకు వైఎస్సార్ సీపీ నేత మద్దతు



రాంబాబుకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేత

దెందులూరు: గ్రంథాలయం కోసం ఏనుగు రాంబాబు దీక్ష చేస్తున్న విషయం విదితమే. ఈ దీక్షకు బుధవారం వైఎస్సార్ సీపీ దెందులూరు మండల సీనియర్ నేత గోపన్నపాలెం సర్పంచ్ భర్త కామా కుమార్‌బాబు మద్దతు తెలిపారు. ఆరోగ్య పరిస్థితిని కుమార్‌బాబు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కేబుల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీలకు శిక్షణ



చేబ్రోలులో సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలులోని సుప్రీం ట్రైనింగ్ సెంటర్ వద్ద సీఆర్‌పీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో జీఆర్ మనోజ్ పాల్గొని చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా ఎలా వేరు చేయాలనే అంశంపై సీఆర్‌పీ (కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్)లకు శిక్షణ ఇచ్చారు. డీపీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శి, నాలుగు మండలాల సీఆర్‌పీలు పాల్గొన్నారు.

దెందులూరు ఆర్‌ఐగా ఆదిత్య



దెందులూరు: దెందులూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బి.ఆదిత్య బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్‌ఐగా పనిచేసిన హేమమాలినీని ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీచేశారు. నూతన ఆర్‌ఐ మర్యాదపూర్వకంగా తహసీల్దార్ బి.సుమతిని కలిశారు.

అండర్‌పాస్‌లో నీటితో ఇక్కట్లు



అండర్‌పాస్‌లో చేరిన వర్షపు నీరు

దెందులూరు: దెందులూరు–అలుగులగూడెం మధ్య రైల్వే శాఖ నిర్మించిన అండర్‌పాస్ ప్రయాణికులకు, పాదచారులకు శాపంగా మారింది. కొద్దిపాటి వర్షానికి అండర్‌పాస్‌లో నీరు చేరి విద్యార్థులకు, వృద్ధులకు, పాదచారులకు, రైతులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. సమస్య పరిష్కారానికి రైల్వే శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని కోట్ల రూపాయలతో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన అండర్‌పాస్ వర్షం వస్తే నరకంగా మారుతుందని 15 గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు సమస్య పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారిణి జాహ్నవీరెడ్డి

భీమడోలు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి జాహ్నవీరెడ్డి అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని గుండుగొలను, కోరుకల్లు గ్రామాల్లో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సులను నిర్వహించారు. గుండుగొలను ఆర్‌సీఎం చర్చి విచారణ గురువులు ఫాదర్ కె.ఛార్లెస్ ఈ చర్చిలో బాల్య వివాహాలు జరగవని ప్రతిజ్ఞ చేయించారు. కోరుకల్లులో వైద్యాధికారిణి జాహ్నవీరెడ్డి ఆసుపత్రి సిబ్బంది, పలు శాఖల సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్, క్రాప్ సిబ్బంది ఆర్.అమరావతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉంగుటూరు: ఈ నెల 26వ తేదీ ఉంగుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఉంగుటూరు (నారాయణపురం) విద్యుత్ సంస్థ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఏపీఈపీడీసీఎస్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఉంగుటూరు, నిడమర్రు మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబులు హాజరవుతారని తెలిపారు.